విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌ను నిర్మూలించాలి

■ మత్తు పదార్థాలపై అవగాహన కల్పించాలి ■ కలెక్టర్ సత్య శారద

కలెక్టరేట్‌లో సమీక్షిస్తున్న కలెక్టర్ సత్యశారద

ఖిలావరంగల్, డిసెంబర్ 12: విద్యా సంస్థల్లో ర్యాగింగ్‌ను నిర్మూలించేందుకు అధ్యాపకులు, యాజమాన్యాలు నిరంతరం సమీక్షస్తుండాలని కలెక్టర్ సత్య శారద సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం ఆమె సంబంధిత అధికారులతో సమీక్షించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. అలాగే, వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కలెక్టర్ గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల అధికారులతో సమీక్షించారు. గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో ఈ నెల 14న ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు నెలవారీ డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపుపై నిర్వహించనున్న వేడుకలకు విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా హాజరవుతారన్నారు. పెంచిన డైట్, కాస్మోటిక్ చార్జీల వివరాలు తెలిసేలా బ్యానర్లు ఏర్పాటు చేయాలన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, మామునూరు ఏసీపీ తిరుపతి, అర్‌అండ్‌బీ ఈఈ జితేందర్ రెడ్డి, డీఈవో జ్ఞానేశ్వర్, డీఎంహెచ్‌వో సాంబశివరావు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ అధికారులు పుష్పలత, పెద్దిరెడ్డి భాగ్యలక్ష్మి, సౌజన్య పాల్గొన్నారు.

ఈవీఎంల గోదాం తనిఖీ

కాశీబుగ్గ: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని జిల్లా వేర్‌హౌస్ గోదాముల్లో భద్రపరిచిన ఈవీఎంలను కలెక్టర్ సత్యశారద అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగా స్ట్రాంగ్ రూమ్ రికార్డులు, భద్రతా చర్యలు, సీసీ కెమెరాల పనితీరును తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట నాయబ్ తహసీల్దార్ రంజిత్, నాయకులు బాకం హరిశంకర్, చింతం రాజు ఉన్నారు.

ఇంత నిర్లక్ష్యమా?

- సీకేఎం హాస్పిటల్‌లో దుర్గంధం
- సెప్టిక్ ట్యాంకు నిండిపోయి ఆవరణలో ప్రవహిస్తున్న మురుగు నీరు
- ముక్కు మూసుకుంటున్న పేషెంట్లు, అటెండెంట్లు
- కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యం

వరంగల్‌చౌరస్తా, డిసెంబర్ 12: ఉమ్మడి వరంగల్ జిల్లాతోపాటు ఉత్తర తెలంగాణలోనే అత్యధిక ప్రసూతి వైద్య సేవలు అందిస్తున్న వరంగల్ సీకేఎం హాస్పిటల్ ఆవరణ దుర్గంధం వెగజల్లుతున్నది. నిత్యం వందలాది మంది మహిళలు ఓపీ, గర్భిణులు ఐపీ సేవల కోసం దవాఖానకు వస్తుంటారు. మంచి వాతావరణంతో స్వాగతం పలకాల్సిన హాస్పిటల్ ఆవరణ ముక్కుపుటలు అదిరేలా దుర్వాసన వెదజల్లుతుండడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శానిటేషన్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతినడంతో సెప్టిక్ ట్యాంకు నీరు పొంగి దవాఖాన ఆవరణలో ప్రవహిస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతున్నది. పర్యవేక్షించాల్సిన కాంట్రాక్టు సంస్థ నిర్వాహకులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో ఈ దుస్థితి దాపురించిందని వైద్యాధికారులే ఉంటున్నారు. కనీసం మూడేళ్లకోసారి సెప్టిక్ ట్యాంకును శుభ్రం చేయించాలని గ్రేటర్ కార్పొరేషన్ అధికారులు ప్రచారం చేస్తున్నా పట్టించుకోవడం లేదు.

సెప్టిక్ ట్యాంకు నిండిపోయి సీకేఎం హాస్పిటల్ ఆవరణలో ప్రవహిస్తున్న మురుగునీరు

సెప్టిక్ ట్యాంకు నిండిపోయి నెలలు గడుస్తున్నా తాత్కాలిక చర్యలు మాత్రమే చేపడుతూ నెట్టుకొస్తున్న కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యం నేడు పేషెంట్లు, హాస్పిటల్ సిబ్బందికి శాపంగా మారింది. దవాఖానలో చికిత్స పొందుతున్న మహిళలు, అటెండెంట్ల విసర్జితాలతో పాటు హాస్పిటల్ అవసరాలకు వినియోగించే పలు రకాల రసాయణాల కారణంగా వెలువుడుతున్న దుర్గంధాన్ని భరించలేక గురువారం వైద్య సేవల కోసం వచ్చిన కొందరు మహిళలు దవాఖాన ఆవరణ నుంచి తిరుగుముఖం పట్టారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, సీకేఎం హాస్పిటల్ వైద్యాధికారులు స్పందించి దవాఖాన ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, అలాగే నెలల తరబడి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టు సంస్థపై చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

సదానందం కుటుంబాన్ని పరామర్శిస్తున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

ఉద్యమకారుడి కుటుంబానికి పరామర్శ

నర్సంపేట, డిసెంబర్ 12: గురిజాలకు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ గ్రామ మాజీ అధ్యక్షుడు నామాల సదానందం(55) బుధవారం రాత్రి అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి గురువారం గ్రామానికి చేరుకొని సదానందం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తర్వాత సదానందం అంతిమయాత్రలో పెద్ది పాల్గొన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహరాములు, మాజీ సర్పంచ్ గొడిశాల మమత-సదానందంగౌడ్, మాజీ ఎంపీటీసీ బండారు శ్రీలత-రమేశ్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు చిన్నపెల్లి నర్సింగం, మాజీ ఎంపీటీసీ గడ్డం కొమురయ్య, మండల ఉపాధ్యక్షుడు అల్లి రవి, నాయకులు దేవేందర్, అశోక్, కుమారస్వామి, ప్రకాశ్ ఉన్నారు.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

వర్ధన్నపేట, డిసెంబర్ 12: భార్య మందలించడంతో మనస్తాపం చెందిన ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇల్లందలో జరిగింది. మృతుడి కుమారుడు జెట్టబోయిన హరీశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జెట్టబోయిన వెంకటయ్య(55) తాపీమేస్త్రీ పని చేస్తున్నాడు. మద్యానికి బానిసైన అతడు నిత్యం తాగి ఇంటికి వస్తున్నాడు. అతడి భార్య వెంకటయ్యను మందలించడంతో మనస్తాపానికి గురైన అతడు రెండు రోజుల క్రితం ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగాడు. వరంగల్‌లోని దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. రెండో కుమారుడు హరీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో ఆర్మీ జవాన్ మృతి

రమేశ్ (ఫైల్)

ఖానాపురం: అనారోగ్యంతో ఆర్మీ జవాన్ మృతి చెందిన ఘటన వేపచెట్టుతండా పరిధి కోమటిపల్లితండాలో జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. తండాకు చెందిన గుగులోత్ రమేశ్(38) 13 ఏళ్ల క్రితం ఆర్మీలో జవాన్‌గా చేరాడు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. రెండు నెలల క్రితం సెలవుపై ఇంటికి వచ్చి వెళ్లాడు. గురువారం ఉదయం కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడాడు. మధ్యాహ్న సమయంలో ఆర్మీ అధికారులు కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి రమేశ్ మృతి చెందినట్లు తెలిపారు. కాగా, రమేశ్ గతంలో అనారోగ్యంతో బాధపడి కోలుకుని తిరిగి విధులకు వెళ్లాడని, ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రమేశ్ ఆకస్మాత్తుగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. మృతుడికి భార్య లలిత, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపు : డీవైఎస్‌వో

నర్సంపేట/గిర్మాజీపేట, డిసెంబర్ 12: క్రీడలు ప్రతి ఒక్కరిలో స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని జిల్లా యువజన, క్రీడల అధికారి (డీవైఎస్‌వో) సత్యవాణి అన్నారు. పట్టణంలోని వల్లభనగర్ మినీస్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న మండల స్థాయి సీఎం కప్ క్రీడోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలై జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అలాగే, వరంగల్ నగరంలోని ఓసిటీ స్టేడియంలో మండలస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు కాశీబుగ్గ డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్ ప్రశంసాపత్రాలు అందించారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

వర్ధన్నపేట/ఖానాపురం/చెన్నారావుపేట/దుగ్గొండి/నెక్కొండ/గీసుగొండ/సంగెం/పర్వతగిరి: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వర్ధన్నపేట మండల ప్రత్యేక అధికారి, వెటర్నరీ ఏడీ వెంకటేశ్వర్లు సూచించారు. సీఎం కప్ క్రీడోత్సవాల్లో భాగంగా మూడు రోజులపాటు నిర్వహించిన మండలస్థాయి పోటీలు గురువారం ముగిశాయి. మండలంలోని ఇల్లంద జడ్పీహెచ్‌ఎస్‌లో ఆయన విజేతలకు బహుమతులు, దాతలు టీ షర్ట్స్‌ను అందజేశారు. ఎంపీడీవో వెంకటరమణ, పీఏసీఎస్ చైర్మన్ కౌడగాని రాజేశ్‌ఖన్నా పాల్గొన్నారు. ఖానాపురం మండలం అశోక్‌నగర్ సైనిక్‌స్కూల్‌లో గెలుపొందిన విద్యార్థులకు ఎంపీడీవో భారతి, ఎంపీవో సునీల్ సర్టిఫికెట్లు అందించారు. సైనిక్‌స్కూల్ ప్రిన్సిపాల్ సురేందర్, పీఈటీలు పాల్గొన్నారు. చెన్నారావుపేటలోని సిద్ధార్థ గురుకుల పాఠశాలలో ఎంపీడీవో శ్రీవాణి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలతోపాటు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సిద్ధార్థ స్కూల్ ప్రిన్సిపాల్ కరుణాకర్, ఉపాధ్యాయులు స్వప్న, భిక్షపతి, రమేశ్, కమలమ్మ, మంజుల, నరసింహ పాల్గొన్నారు. దుగ్గొండి మండలంలో నిర్వహించిన క్రీడల్లో విజేతలైన వారిని ఎంపీడీవో లెక్కల అరుంధతి, ఎంపీవో మోడెం శ్రీధర్‌గౌడ్, ఎంఈవో వెంకటేశ్వర్లు అభినందించి ప్రశంసాప్రతాలు అందజేశారు. నెక్కొండలోని విద్యోదయ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి పోటీల్లో విజేతలకు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో డీఏవో కె.అనురాధ సమక్షంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. గీసుగొండలోని జడ్పీహెచ్‌ఎస్‌లో తహసీల్దార్ రియాజుద్దీన్, ప్రత్యేక అధికారి సురేశ్, ఎంపీడీవో కృష్ణవేణి విజేతలను అభినందించారు. సంగెం జడ్పీహెచ్‌ఎస్‌లో విజయం సాధించిన క్రీడాకారులకు ఎంపీడీవో ఓంప్రకాశ్, ఎంపీవో కొమురయ్య ప్రశంసాపత్రాలు అందించారు. పర్వతగిరి మోడల్ స్కూల్‌లో విజేతలకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలను ప్రత్యేకాధికారి నీరజ, ఎంపీడీవో శంకర్, తహసీల్దార్ వెంకటస్వామి, ఎంఈవో లింగారెడ్డి, ఎంపీవో పాక శ్రీనివాస్ తదితరులు అందించారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు తాళాలు!

■ కొరవడిన అధికారుల పర్యవేక్షణ ■ సెంటర్లలో పౌష్టికాహారం కొరత

పదహారు చింతలతండాలో తాళం వేసి ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

చెన్నారావుపేట, డిసెంబర్ 12: గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందించాలనే సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు సిబ్బంది నిర్లక్ష్యంతో మూసి ఉంటున్నాయి. దీంతో లబ్ధిదారులకు పౌష్టికాహారం అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా గురువారం మండలంలోని పదహారు చింతలతండా, మాధవనగర్ కాలనీ, చెరువుకొమ్ముతండాలోని అంగన్‌వాడీ కేంద్రాలు మూసి ఉన్నాయని స్థానికులు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పోషకాహారం, గుడ్లు అందించాల్సిన సిబ్బంది విధులకు రాకుండా తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అంగన్‌వాడీ సెంటర్లను ఎప్పుడు తెరుస్తారో.. ఎప్పుడు మూస్తారో తెలియడం లేదని వాపోతున్నారు. కేంద్రాలను పర్యవేక్షించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పౌష్టికాహారం కొరత కారణంగా సెంటర్లను తెరవడం లేదనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహనపై దృష్టి సారించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

భార్య మృతి కేసులో భర్తకు ఐదేళ్ల జైలు

ఖానాపురం, డిసెంబర్ 12: భార్య మృతి కేసులో భర్తకు ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ. 2 వేల జరిమానా విధిస్తూ వరంగల్ మొదటి అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి జి.ప్రేమలతారెడ్డి తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కొత్తూరుకు చెందిన అమరావతి కృష్ణ నిత్యం మద్యం తాగొచ్చి భార్యను వేధించడంతోపాటు అదనపు కట్నం కోసం ఇబ్బంది పెడుతున్నాడు. 2018 ఆగస్టు 1న మద్యం మత్తులో భార్యతో గొడవపడి ఇద్దరం కలిసి చనిపోదామని ఇంట్లో ఉన్న కిరోసిన్‌ను తనపై కొద్దిగా, తన భార్యపై పూర్తిగా పోశాడు. తన ఒంటిపై ఉన్న చొక్కా విప్పి నిప్పంటించుకొని భార్యపై విసిరివేయగా ఆమె తీవ్రంగా కాలిపోయింది. ఈ క్రమంలో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. ఈ కేసులో ఎంజీఎం ఆసుపత్రిలో ఆమె ఇచ్చిన వాంగ్మూలాన్ని మెజిస్ట్రేట్ రికార్డు చేసుకున్నాడు. నేరం రుజువు కావడంతో నిందితుడికి శిక్ష విధించారు. ఈ కేసును ఛేదించిన దుగ్గొండి సీఐ, ఖానాపురం ఎస్సై, కోర్టు కానిస్టేబుల్‌ను నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్ అభినందించారు.

'మంత్రి సురేఖను బర్తరప్ చేయాలి'

కాశీబుగ్గ, డిసెంబర్ 12: దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను మంత్రి పదవి నుంచి వెంటనే బర్తరప్ చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు సముద్రాల పరమేశ్వర్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ గీసుగొండలోని గోశాలకు నిబంధనలకు విరుద్ధంగా గోవులను కేటాయించినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. నైతిక బాధ్యత వహిస్తూ సురేఖ తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో సురేఖపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి, గవర్నర్‌కు పోస్టుకార్డుల ద్వారా లేఖలు రాసినట్లు పరమేశ్వర్ చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, ఎరుకల రఘునారెడ్డి, గడల కుమార్‌యాదవ్, పార్టీ ఆనంద్, కోమాకుల నాగరాజు, కట్టర్ సతీశ్, కందుకూరి శ్రీనివాస్, నోముల రతన్, మడిపల్లి నాగరాజు, గాదె భిక్షపతి, అల్లి అజయ్, ఆడెపు అనిల్ పాల్గొన్నారు.

'జీరో వన్ జీరో పద్దు ద్వారా జీతాలు చెల్లించాలి'

చెన్నారావుపేట/సంగెం, డిసెంబర్ 12: జీరో వన్ జీరో పద్దు ద్వారా ఉపాధ్యాయుల జీతాలు చెల్లించాలని అమీనాబాద్ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. నేషనల్ ఇంక్రిమెంట్, హెల్త్ కార్డులను అందజేయాలన్నారు. హెల్త్ కార్డులు, కారుణ్య నియామకాలు లేకపోవడంతో ఉపాధ్యాయులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. కార్యక్రమంలో టీఎంఎస్‌టీఏ, పీఎంటీఏ బాధ్యులు సురేశ్, మహేందర్, నల్లతీగల యాకయ్య, యాకూబ్, సూరిబాబు, సుధాకర్ పాల్గొన్నారు. అలాగే, సంగెం మండలం గవిచర్ల మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

ఖిలావరంగల్/గీసుగొండ, డిసెంబర్ 12: గీసుగొండ మండలం నందారాంనాయక్‌తండాకు చెందిన భూక్యా శంకర్ లేబర్‌కాలనీ అడ్డా వద్ద గుడుంబా విక్రయిస్తుండగా అరెస్ట్ చేసినట్లు మిల్స్‌కాలనీ సీఐ జే వెంకటరత్నం గురువారం తెలిపారు. అతడి నుంచి 30 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అలాగే, గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ గోపాల్‌రెడ్డి నగర్‌లో ధరావత్ లక్ష్మి గుడుంబా రవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు గీసుగొండ ఎస్సై కుమార్ తెలిపారు. లక్ష్మి నుంచి రూ. 6 వేల విలువైన 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆమెపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

గ్రూప్-2 పరీక్షలను విజయవంతం చేయాలి

ఖిలావరంగల్, డిసెంబర్ 12: ఈ నెల 15, 16 తేదీల్లో జరిగే గ్రూప్-2 పరీక్షలను అధికారులు సమష్టిగా విజయవంతం చేయాలని కలెక్టర్ సత్య శారద అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం ఆమె గ్రూప్-2 పరీక్షల నిర్వహణపై రీజినల్ కో ఆర్డినేటర్లు, పోలీసు నోడల్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్, డీవో, స్క్వాడ్స్‌తో సమీక్షించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. టీపీఎస్సీ గైడ్ లైన్స్‌ను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి పాల్గొన్నారు.

రవీందర్‌కు భారత సేవారత్న అవార్డు

అవార్డు అందుకుంటున్న రవీందర్

పోచమ్మమైదాన్, డిసెంబర్ 12: వరంగల్ బ్యాంకు కాలనీ, శాంతినగర్‌కు చెందిన సామాజికవేత్త, పద్మశాలీ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆడెపు రవీందర్‌కు భారత సేవారత్న నేషనల్-2024 అవార్డు ప్రదానం చేశారు. మూడు దశాబ్దాల నుంచి కళాకారులకు అండగా ఉంటూ, లయన్స్ క్లబ్ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రవీందర్‌ను గుర్తించి అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వరంగల్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో అవార్డుతోపాటు జ్ఞాపిక అందజేసి, శాలువా కప్పి సత్కరించారు. సమావేశంలో వడ్నాల నరేందర్, మార్గం ఎల్లయ్య, కాసం నమఃశివాయ, గడ్డం కేశవమూర్తి, ఈగ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి

ఖానాపురం, డిసెంబర్ 12: మక్కజొన్న పంటలో సస్యరక్షణ చర్యలు చేపడితేనే అధిక దిగుబడి సాధ్యమని ఏవో శ్రీనివాస్ సూచించారు. గురువారం ఆయన రాగంపేట, మంగళవారిపేటలో మక్కజొన్న పంటలను పరిశీలించారు. మక్కజొన్న పంటకు కత్తెర పురుగు ఆశించిందని, నివారణకు మిత్రపురుగులను రక్షిస్తే అవి కత్తెర పురుగులను ఆహారంగా తిని పంటను కాపాడతాయన్నారు. రసాయన పురుగు మందులైతే క్లోరోఫైర్‌పాస్ సరైన మోతాదులో పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం

గ్రేటర్ వరంగల్ 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి

కరీమాబాద్, డిసెంబర్ 12: డివిజన్‌లోని సమస్యలను పరిష్కరించడంలో గ్రేటర్ కార్పొరేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి ధ్వజమెత్తారు. డివిజన్‌లోని సమస్యలను వివరిస్తూ గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌కు అనేకసార్లు వినతిపత్రాలు అందజేసినా స్పందన కరువైందన్నారు. మేయర్ గుండు సుధారాణి స్వయంగా సమస్యలు పరిశీలించినా నేటికీ మోక్షం లేదన్నారు. దీంతో డివిజన్ ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. ప్రజల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

రైతులు అక్రమంగా వరి సాగు చేస్తే చర్యలు: డీఈ

సమావేశంలో మాట్లాడుతున్న నర్సంపేట ఐబీ డీఈ సంతోష్

నర్సంపేట, డిసెంబర్ 12: రైతులు అక్రమంగా వరి సాగు చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని నర్సంపేట ఐబీ డీఈ సంతోష్ హెచ్చరించారు. పట్టణంలోని నర్సంపేట ఐబీ కార్యాలయంలో గురువారం మాదన్నపేట పెద్ద చెరువు యాసంగి వరి సాగు కోసం తైబందీ ఖరారు. అధికారులు నిర్ణయించిన తైబందీ ప్రకారమే రైతులు యాసంగి వరినార్లు వేసుకోవాలని డీఈ సూచించారు. మాదన్నపేట పెద్ద చెరువులో ప్రస్తుతం 14 ఫీట్ల నీరు ఉందన్నారు. ఈ నీటి మట్టానికి తగిన విధంగా తైబందీ ఖరారు చేసినట్లు చెప్పారు. పాలాయి రామస్వామి బుర్ర నుంచి వరంగల్ రోడ్ వరకు 260 ఎకరాలు, కప్పలోని బుర్ర నుంచి చివరి ఆయకట్టు వరకు 300 ఎకరాలు, పెద్ద కాల్వ మొత్తం ఆయకట్టు 560 ఎకరాలు, దుబ్బ కాల్వ పరిధిలో కుమ్మరిగడ్డ బుర్ర నుంచి చివరి ఆయకట్టు వరకు 270 ఎకరాలు కలిపి మొత్తం 830 ఎకరాలకు తైబందీ ఖరాలు చేసినట్లు ఆయన స్పష్టం చేశారు. దుబ్బ కాల్వ, పెద్ద కాల్వ తూములను ఈ నెల 25న తీస్తామని చెప్పారు. ఆయకట్టు రైతులు గమనించి యాసంగి వరినార్లు పోసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐబీ ఏఈ నితిన్, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో ఇరుముడి ప్రారంభం

దివ్య పడిపూజలో పాల్గొన్న భక్తులు

నర్సంపేట, డిసెంబర్ 12: పట్టణంలోని శ్రీధర్మశాస్త అయ్యప్ప ఆలయంలో గురువారం ఇరుముడులతో శబరిమల యాత్రను ప్రారంభించారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ గుప్తా ఆధ్వర్యంలో మాలధారులకు ఇరుముళ్లను ప్రారంభించారు. ప్రతి మాలధారు ఇరుముడితో శబరిమలకు తరలివెళ్తున్నారు. ఈ సందర్భంగా మాధవశంకర్ మాట్లాడుతూ నర్సంపేట డివిజన్‌లో 1150 అయ్యప్ప మాల ధరించగా, ఇప్పటి వరకు 82 మంది ఇరుముడి కట్టుకున్నారని తెలిపారు. ప్రతి మాలధారు శబరిమలకు వెళ్లి పెద్ద పాదం, చిన్న పాదం చేస్తారన్నారు. గురుస్వాములు పూర్తి బాధ్యత వహించాలని కోరారు. ప్రతి మాలధారు గురుస్వాములకు సహకరించాలని కోరారు. అలాగే, అయ్యప్ప ఆలయంలో అర్చకుడు శ్రీదేవేష్ మిశ్రా ఆధ్వర్యంలో దివ్య పడిపూజ, పుష్పాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సైప సురేశ్, ప్రధాన కార్యదర్శి చింతల కమలాకర్‌రెడ్డి, కోశాధికారి దొడ్డ రవీందర్, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

22న ఉద్యోగుల 'కాకతీ కదన భేరి'

పోచమ్మమైదాన్, డిసెంబర్ 12: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు 2025 ఏప్రిల్ 1 నుంచి అమలు చేయనున్న ఏకీకృత పెన్షన్ విధానాన్ని వ్యతిరేస్తూ ఈ నెల 22న వరంగల్ ఇస్లామియా గ్రౌండ్‌లో మధ్యాహ్నం 3 గంటలకు పెద్ద ఎత్తున కాకతీ కదన భేరి నిర్వహించనున్నట్లు టీఎస్ సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ అన్నారు. వరంగల్ ఎల్‌బీనగర్‌లోని చార్‌బౌళి పాఠశాల ఆవరణలో కాకతీ కదన భేరి వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఏకీకృత పెన్షన్ విధానం ఉద్యోగులను మోసగించి, కార్పొరేట్ సంస్థల కడుపు నింపడానికి తప్ప ఉద్యోగుల సామాజిక భద్రత చేకూర్చే పథకం కాదని, దీన్ని ప్రతిఘటించడానికి అందరూ కదలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వాల శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి రవీందర్, ఉపాధ్యక్షులు లింగమూర్తి, బుచ్చన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్లికార్జున్, రాజేందర్, జీవన్‌కుమార్, అప్జల్, కొండ శ్రీనివాస్, లక్ష్మణమూర్తి, మాధవి, నరసింగరావు, దిల్షాన్, నర్సమ్మ, సరళ, రాణి, అశ్విని, రాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

స్థానిక సంస్థల ఎన